సాక్షి అనకాపల్లి
మంగళవారం : 2 : ఏప్రిల్ : 2024



ముమ్మర తనిఖీలు

విశాఖ: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

విశాఖ: ఏయూ వృక్షశాస్త్ర విభాగానికి బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా నూతన ప్రాజెక్టును మంజూరు చేసింది.

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
6.14	4.37

నర్సీపట్నం

ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
6.17	4.34

న్యూస్‌రీల్

గోవాడ ఫ్యాక్టరీ రైతులకు శుభవార్త

- నేటి నుంచి రూ. 8.68 కోట్ల చెరకు సొమ్ము చెల్లింపు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెరకు సొమ్ము చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. మంగళవారం నుంచి రెండో విడతగా 8 కోట్ల 68 లక్షల 69 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. 2023–24 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే మొదటి విడతగా గత నెలలో రూ. 8.75 కోట్లు చెల్లించామన్నారు. ఈ ఏడాది జనవరి 16 నుంచి 31వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన రైతులకు రూ.8.68 కోట్లు చెల్లింపులు చేస్తున్నామన్నారు. రెండో విడతలో 34,747 టన్నులకుగాను టన్నుకు రూ. 2,500 చొప్పున రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో రెండు లక్షల టన్నులు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చెరకు లేకపోవడంతో లక్షా 70 వేల 601 టన్నుల వరకు మాత్రమే క్రషింగ్ చేశామన్నారు. సరాసరి రికవరీ 9.02 రాగా, లక్షా 46 వేల 309 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేశామన్నారు. చెరకు సరఫరా చేయడంలో ఫ్యాక్టరీ సభ్యరైతులు మరింత చొరవ చూపి ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు. కనీసం 3 లక్షల టన్నులైనా చెరకు సరఫరా అయ్యేలా ఈ ఏడాది సాగు పెంచాలన్నారు. సబ్సిడీపై అవసరమైన ఎరువులు, విత్తనం ఇస్తున్నామని చెప్పారు.

రెసిడెన్షియల్ ప్రవేశాలకు గడువు పెంపు

నర్సీపట్నం: ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు నర్సీపట్నం రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ వి.వి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లాలోని నర్సీపట్నం, అచ్యుతాపురం పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గత నెల 31 వరకు గడువు విధించగా, ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు. ప్రవేశ పరీక్ష తేదీల్లో మార్పు లేదని స్పష్టం చేశారు.

ఆ మార్గంలో రైళ్ల వేగ పరిమితి పెంపు



తాటిచెట్లపాలెం (విశాఖ) : ప్రయాణికుల సౌకర్యార్థం వాల్తేర్ డివిజన్ పరిధి విశాఖపట్నం–పలాస మార్గంలో రైళ్ల వేగం పరిమితిని పెంచుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గంలో ఇంత వరకు రైళ్ల గరిష్ట వేగం 110 కి.మి/గంటకు ఉండగా, దీనిని 130 కి.మి/గంటకు పెంచారు. ఈ మార్గంలో ప్రయాణించే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణించే రైళ్లు, వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై 130 కిమీ/గంటకు గరిష్ట వేగంతో ప్రయాణిస్తాయి. అప్, డౌన్, 3వ లైన్‌లలో ఈ వేగ పరిమితి పెంపు అమలు చేయనున్నారు. వెంటనే ఇది అమల్లోకి వస్తుందని త్రిపాఠి పేర్కొన్నారు. ఈ వేగ పరిమితి పెంపు గోపాలపట్నం–దువ్వాడ మధ్య మాత్రం వర్తించదన్నారు.

పండుటాకులపై రాజకీయాలా?



కళ్లలో కాంతులు: ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ అందుకున్న వృద్ధురాలి ముఖంలో ఆనందం (ఫైల్)

- ఐదేళ్లుగా ఒకటో తేదీనే చేతికి పింఛన్
- తెల్లారేసరికే ఇంటి తలుపు తట్టిన వలంటీర్లు
- పచ్చమూక కుట్రతో పెన్షన్ల పంపిణీకి బ్రేకులు
- చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు
- పింఛన్ కోసం మండుటెండలో సచివాలయాలకు వెళ్లలేమంటున్న వృద్ధులు
- కూటమి అధికారంలోకి వస్తే తిప్పలు తప్పవని ఆందోళన
- మళ్లీ జగన్‌నే గెలిపించుకుంటామని ఉద్ఘాటన

నాడు అలా..	
టీడీపీ పాలనలో ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	
అర్బన్ ప్రాంతంలో	1,16,789
గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలో	3,05,546
మొత్తం పింఛన్ల సంఖ్య	4,22,335
ప్రతినెలా చెల్లించిన మొత్తం	రూ.75.83 కోట్లు

నేడు ఇలా..	
2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో	
ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పెన్షన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న సొమ్ము	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాల్లో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు



నిరాశ.. నిస్పృహలు: పింఛను కోసం సచివాలయానికి వెళ్లి నిరాశగా వెనుదిరుగుతున్న వృద్ధులు



కోటవురట్ల మండలం రాజుపేటలో పింఛను డబ్బులు రాలేదని మండుటెండలో సచివాలయానికి వెళుతున్న వృద్ధురాలు రాజులమ్మ

సాక్షి, విశాఖపట్నం: సోమవారం వేకువజామున అవ్వా, తాతా అనే పిలుపు వినబడలేదు. సూర్యోదయానికి ముందే తలుపు తట్టిన శబ్దం రాలేదు. పొద్దెక్కుతున్నా ఆప్యాయంగా పలకరించే వలంటీర్ జాడ కనిపించలేదు. దీంతో ఈ రోజు ఒకటో తారీఖేనా? అంటూ ఒకటికి రెండుసార్లు సందేహ నివృత్తి చేసుకున్నారు. ఔనని నిర్ధారించుకున్న తరువాత.. మరి తెల్లారకుండానే పింఛన్ సొమ్ము చేతిలో పెట్టే వలంటీరు ఎందుకు రాలేదు? అంటూ ఇరుగు పొరుగు వారిని ఆత్రంగా ఆరా తీశారు. 'చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడ్డారంట.. ఆ బాబు పాలనలో మాదిరిగానే ఊళ్లో సచివాలయాలకెళ్లి పింఛన్ డబ్బు తీసుకోవాలంట.. ఇంటికి తెచ్చి ఇవ్వరంట..' అని చావు కబురు చల్లగా చెప్పగా పడుతూ లేస్తూ జీవనం సాగించే పండుటాకులు మండిపడుతున్నారు. మండుటెండల్లో సచివాలయానికి వెళ్లడం ఎలా? అంటూ ఆవేదన చెందుతున్నారు. వయసు మీరి కాళ్లు కదపలేని వారు.. ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టిన వారు.. ఏ ఆసరా లేని వారు.. మంచాన పడి కదల లేనివారు.. దివ్యాంగులు.. ఇలా ఎందరో పేద ముదుసలులు తమ పరిస్థితి ఏమిటంటూ ఉసూరుమంటున్నారు. చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ సొమ్మును వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఇంటికి తెచ్చి ఇస్తున్నారని.. కూటమి అధికారంలోకి వస్తే మునుపటిలా తమకు తిప్పలు తప్పవని భయాందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించుకుంటామని నెలనెలా ఠంచనుగా పింఛన్ అందుకుంటున్న వారు ఉద్ఘాటిస్తున్నారు.

ఐదేళ్ల క్రితం పెన్షన్ రూ.వెయ్యే..

చంద్రబాబు హయాంలో అర్హులందరికీ కాకుండా ఏ కొద్దిమందికో పింఛన్ అందేది. అదీ అరకొరగానే. 2019 జనవరి వరకు నెలకు రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. ఈ సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రూ.2 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. వైఎస్ జగన్ హామీ మేరకు అధికారంలోకి వచ్చాక పింఛన్ సొమ్మును రూ.2,250 నుంచి నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచుతూ వచ్చారు. అదీ ఇంటికే తెచ్చి ఇచ్చే వ్యవస్థను తెచ్చారు. టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో (2019 ఎన్నికల ముందు వరకు) ప్రతి నెలా 4,22,335 మందికి రూ.75.83 కోట్లు చెల్లించేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు 5,61,336కి పెంచారు. నెలనెలా రూ.166.82 కోట్లు పంపిణీ చేస్తున్నారు.



చంద్రబాబూ.. మమ్మల్ని ఇలా బతకనీయ్

ఇంటికి తెచ్చి పింఛనీలివ్వడం ఐదేళ్ల నుంచి జరుగుతోంది కదా. ఇప్పుడెందుకు సెంద్రబాబుకు ఈ పాడు బుద్ధి పుట్టింది. వలంటీర్లు ఏం తప్పుచేశారని పింఛనీలు వాళ్ల ద్వారా ఇవ్వొద్దని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మాలాంటోళ్లం ఓటెవరికేయాలో ఎప్పుడో నిర్ణయించుకున్నాం. ఏం వలంటీర్లు మాకు సెప్పాలేటి. పైసా మామూళ్లు తీసుకోకుండా ఎంచక్కా ఒకటో తేదీనే పింఛనీ తెచ్చి ఇచ్చే వోళ్లు. ఆస్పత్రిలో ఉన్నా సరే పింఛనీ అందించేవోళ్లు. వలంటీర్ల మీద తప్పుడు ఫిర్యాదు చేయడం సెంద్రబాబుకు తగదు. చాలా తప్పు సేత్తన్నాడు. ఫలితం అనుభవిస్తాడు. సీఎం అవ్వకుండానే ఇన్ని ఇబ్బందులు పెడుతున్నాడు. పదవిలోకి వస్తే జగన్‌బాబు ఇచ్చిన పథకాలన్నీ రద్దు చేసేత్తాడు. గతంలో పింఛనీ మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీలకు తొలినెల పింఛను మామూళ్లు కింద ఇచ్చుకోవాలి. ఇపుడలా కాదు. సెంద్రబాబూ నీకో నమస్కారం. మమ్మల్ని ఇలా బతకనీయ్ చాలు.

– కొల్లినారాయణమూర్తి, దంతం శెట్టి రమణ, రామన్నపాలెం, కోటవురట్ల మండలం

నాకు కాళ్లు, చేయి లేదు.. ఎలా వెళ్లగలను



సీఎం జగన్ తీసుకొచ్చిన వలంటీరు వ్యవస్థలో ఐదేళ్లుగా ప్రతినెలా ఒకటినే తెల్లారక ముందే ఇంటి తలుపు తట్టి పింఛన్ నగదు అందించేవారు. టీడీపీ నాయకులకు దివ్యాంగులు, వృద్ధులు, మంచానపడ్డ వారి కష్టాలు కనిపించవు. నాకు రెండు కాళ్లు, చేయి లేదు. సచివాలయానికి ఎలా వెళ్లగలను. సచివాలయం దగ్గర గంటల కొద్దీ ఎండలో వేచి ఉండి, పింఛన్ తీసుకోవాలంటేనే ఆందోళనగా ఉంది. పనిచేసే నాయకుడికి ఎవరైనా ఓటు వేస్తారు. అంతేగాని వలంటీర్ ఇంటికొచ్చి మాలాంటోళ్లకు పింఛన్ నగదు అందించినంత మాత్రాన మమ్మల్ని ప్రలోభాలకు గురిచేస్తున్నారని అబద్ధపు ప్రచారంతో ఇబ్బందులు పెట్టడం మంచిది కాదు. కరోనా సమయంలో, వరదలు వచ్చినపుడు వలంటీర్లు ఇంటింటికొచ్చి పింఛన్లు, రేషన్ బియ్యం, వస్తువులు అందించింది మర్చిపోలేం కదా. ఇప్పుడు ఎన్నికల కోడ్ అని వారిని ఆపేయడం సరికాదు. ఎన్నికల అధికార్లు ఆలోచన చేయాలి.

– వియ్యపు సోమునాయుడు, దివ్యాంగుడు, పెదపూడి గ్రామం, బుచ్చెయ్యపేట మండలం

4 కి.మీ. నడిచి ఎలా వెళ్లాలి?



నేను పింఛన్ అందుకోవాలంటే నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించి చింతలపూడి పంచాయతీకి చేరుకోవాల్సిన పరిస్థితి. దట్టమైన అటవీ ప్రాంతంలో మాకు ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే ఇంటి కొచ్చి పింఛన్ సొమ్మును వలంటీర్ అందించేవాడు. వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు కుట్రలు చేసి అడ్డుకున్నారని తెలిసింది. అందువల్లే ఒకటో తేదీన మాకు పింఛన్ అందలేదు. నడవలేని స్థితిలో ఉన్న మాలాంటి వృద్ధులను ఇబ్బందులకు గురి చేయడం దారుణం. వలంటీర్ ద్వారా ఇంటింటా పింఛన్లు పంపిణీ చేయకపోతే అంత దూరం వెళ్లలేని పరిస్థితి నాది. ఈ నెల పింఛన్ సొమ్ము వదులు కోవడం తప్ప, మరో దారి లేదు.

– నంది ఎరుకులు, నేరెళ్లపూడి గ్రామం, చింతలపూడి పంచాయితీ, దేవరాపల్లి మండలం

వలంటీర్లు కారు.. ఆపద్బాంధవులు

కరోనా విలయతాండవం చేస్తున్న రోజులవి. ముందు రోజు కళ్ల ముందు కనిపించిన వారు మరుసటి రోజుకే శాశ్వతంగా కనిపించని పరిస్థితి. చుట్టుపక్కల వారేంటి.. చుట్టాలూ బంధువులు కూడా ఇంటికొచ్చి పరామర్శించే సాహసం చేయలేని దుస్థితి. మన రాష్ట్రం మినహా.. ప్రపంచమంతా ఇదే తీరు. ఆ సమయంలో వలంటీర్లే ఆపద్బాంధవులయ్యారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక మన అవసరాలు తీర్చారు. ఇంటికే వెళ్లి పింఛన్లను అందించారు. కష్టం పేదింటిని తాకాలంటే.. తమను దాటి వెళ్లాలన్నంత ధీమాగా తమ బాధ్యతల్ని నిర్వర్తించారు. అలాంటి వారిపై విపక్ష కూటమి కుయుక్తులు పన్నింది. చివరికి పింఛన్ లబ్ధిదారుల కన్నీటికి కారణమయింది.



కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో ఇంటి వద్దకు వెళ్లి పింఛను అందిస్తున్న వలంటీరు (ఫైల్)

- అవ్వా తాతల అభిమానం పొందినవారిపై విపక్షాల అక్కసు
- పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డంకులపై లబ్ధిదారుల ఆగ్రహం
- కరోనా సమయంలో వలంటీర్ల సేవలు మర్చిపోయారా?

నక్కపల్లి: కరోనా సమయంలో గ్రామ/వార్డు వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివి. 2020 మార్చి నుంచి 2021 చివర వరకు కరోనా సంక్షోభం ప్రపంచ దేశాలతోపాటు, రాష్ట్రాన్నీ కుదిపేసింది. ప్రజానీకం ఇంటి నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి. బయటకు వెళ్లి పనులు చేయకపోతే పూటగడవని పేదల ఆకలి కేకలు వర్ణనాతీతం. ఇలాంటి సందర్భంలో దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు అందరి ప్రశంసలు అందుకున్నాయి.

వలంటీర్ల సేవలకు వెలకట్టగలమా?

కరోనా కేసులను ముందుగానే గుర్తించి వారికి మెరుగైన చికిత్సను అందించి మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో వలంటీర్లే ప్రధాన పాత్ర పోషించారు. కరోనా సంక్షోభ సమయంలో కూడా సంక్షేమ పథకాలను అమలుచేసి, ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడంలో కీలకంగా ఉన్నది వలంటీర్ వ్యవస్థే. కరోనా రక్కసి ఉధృతంగా ప్రబలుతున్న సమయంలో బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి. ఆ సమయంలో కూడా వలంటీర్లు తమ ప్రాణాలకు తెగించి కోవిడ్ కేసులను గుర్తించడం, పాజిటివ్ కేసులను ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలకు తరలించడంలో సాయపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. ప్రభుత్వం సమకూర్చిన సరుకులు, అంగన్‌వాడీ పోషకాహారాన్ని ఇంటింటికీ చేర్చింది వలంటీర్లే. కరోనా కేసులున్న ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫినాయిల్‌లతో పాటు, కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల సాయంతో హైపోక్లోరైడ్ ద్రావణ పిచికారీ పనులు కూడా చేశారు.

వలంటీర్ వ్యవస్థపై కన్నుకుట్టి..

కరోనా సంక్షోభంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లపై చంద్రబాబు నాయుడు, ఆయన తొత్తులు కక్షగట్టారు. ఎన్నికల సమయంలో వీరి ద్వారా పింఛన్లు పంపిణీ చేయరాదంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కాకుండా అడ్డుకున్నారు. ఒకటో తేదీ వచ్చింది వలంటీరు ఇంకా పింఛను తీసుకు రాలేదేంటా? అని అవ్వాతాతల ఎదురుచూపులు. ఈ నెల నుంచి పింఛను కోసం మళ్లీ ఈసురోమని పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సిందేనన్న కబురు వారి చెవిన పడింది. కారణం తెలుసుకుని చంద్రబాబు పైశాచికానందంపై అవ్వాతాతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.



కరోనా సంక్షోభంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి క్లోరినేషన్ పనుల్లో వలంటీర్లు (ఫైల్)

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

- ఏపీఐఐసీ అధికారిపై దాడిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్
- సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశం
- పొక్లెయిన్, రెండు ట్రాక్టర్ల సీజ్
- ఐదుగురిపై కేసు నమోదు



అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించిన సీఐ విజయ్‌కుమార్



పోలీసులు సీజ్ చేసిన పొక్లెయిన్లు

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ భూముల్లో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇక్కడ డిప్యూటీ జోనల్ మేనేజర్‌పై మైనింగ్ మాఫియా దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ సమగ్రంగా విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఐ విజయ్‌కుమార్ సోమవారం సంఘటనా స్థలాన్ని, అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఒక పొక్లయిన్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. నక్కపల్లి మండలంలో విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 5 వేల ఎకరాల జిరాయితీ, డీఫారం భూములను సేకరించింది. బాధిత రైతులందరికీ నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లింపులు పూర్తయ్యాయి. స్టార్టప్ ఏరియా కింద 1,100 ఎకరాలు సిద్ధం చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.400 కోట్లు విడుదల చేసింది. వర్చువల్ పద్ధతిలో ఈ పనులకు రెండు నెలల క్రితం పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ భూముల్లో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇక్కడ గ్రావెల్, ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రధానంగా అమలాపురం శివారు మూలపర, చందనాడ, బోయపాడు, డీఎల్‌పురం, పాటిమీద, వేంపాడు, రాజయ్యపేట, నెల్లిపూడి, గునిపూడి తదితర ప్రాంతాల్లో సముద్ర తీరానికి ఆనుకున్న ప్రాంతాలతోపాటు మిగిలిన ఏపీఐఐసీ భూముల్లో నిరంతరం పదుల సంఖ్యలో జేసీబీలు వినియోగించి ఈ దందా నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులకు, మీడియా వారికి నెలవారీ మామూళ్లు ఇస్తుండటంతో చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ దృష్టికి వెళ్లడంతో విచారణ చేసి అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని రెండు రోజుల క్రితం డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబును ఆదేశించారు. దీంతో ఆయన ఆదివారం సాయంత్రం అమలాపురం శివారు మూలపర వద్దకు వెళ్లి అక్కడ జేసీబీలను పట్టుకున్నారు.

మైనింగ్ నిలిపివేయాలని హెచ్చరించడంతో మైనింగ్ మాఫియా అతడిపై దాడి చేసింది. రాజయ్యపేటకు చెందిన జనసేన పార్టీ నాయకుడితోపాటు మరో నలుగురు తనపై దౌర్జన్యం చేసి కాలర్ పట్టుకుని కొట్టారంటూ శ్రీనుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ విజయ్‌కుమార్ విచారణ చేపట్టారు. అధికారిపై దాడి చేసిన పుణ్యమంతుల సంజీవి, పిక్కి కోదండరావు, మనబాల గణేష్, రావి రాజు, యలమంచిలి దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

యలమంచిలి టీడీపీలో డిష్యుం డిష్యుం

- ఆత్మీయ సమావేశంలో అసమ్మతి జ్వాల
- తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట
- పప్పల చలపతిరావును నెట్టేసిన తెలుగు తమ్ముళ్లు
- కంగుతిన్న సి.ఎం.రమేష్ సోదరుడు రాజేష్
- అన్యాయం చేస్తే తడాఖా చూపిస్తానన్న ప్రగడ



యలమంచిలిలో ఒకరినొకరు తోసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

యలమంచిలి రూరల్/యలమంచిలి: టీడీపీ, జనసేన, బీజేపీలలో పొత్తు ప్రకంపనలు యలమంచిలి నియోజకవర్గంలో కాక రేపుతున్నాయి. కోట్లు ఖర్చు పెట్టించి ఐదేళ్లు టీడీపీ కోసం పని చేయించుకుని, తమ నేత గొంతు కోశారంటూ ప్రగడ నాగేశ్వరరావు వర్గీయులు సోమవారం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ నేతకు తెలియకుండా యలమంచిలిలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ కార్యాలయం మొదటి అంతస్తులో నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ సమావేశాన్ని మూకుమ్మడిగా అడ్డుకున్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ సోదరుడు రాజేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీష్‌ల సమక్షంలోనే టీడీపీ సీనియర్ నేత పప్పల చలపతిరావును వేదికపైకి రానీయకుండా నెట్టేశారు. రెండు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో సమావేశ ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. జై ప్రగడ.. జై జై ప్రగడ, పప్పల గోబ్యాక్ నినాదాలు మార్మోగాయి. ప్రగడ నాగేశ్వరరావు సమక్షంలోనే ఆయన వర్గీయులు ఆందోళన చేశారు. దీంతో సమావేశం ప్రారంభం కాకుండానే వాయిదా వేస్తున్నట్టు బుద్ధ నాగజగదీష్ ప్రకటించారు.

రెండ్రోజుల్లో సత్తా చూపుతాం

పార్టీ అధిష్టానం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే రెండ్రోజుల్లో 10 వేల మందితో సమావేశం ఏర్పాటు చేసి తన సత్తా చూపుతానని ప్రగడ నాగేశ్వరరావు అల్టిమేటం జారీ చేశారు. ఆ సమావేశంలో తమ నేత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన వర్గీయులు స్పష్టం చేశారు. నియోజకవర్గానికి చెందిన కొందరు నేతలు అమ్ముడుపోయారని, వారి వల్లనే తమ నేతకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడాల్సిందే: పప్పల చలపతిరావు

టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని నాయకులు, కార్యకర్తలు శిరసావహించాల్సిందేనని పార్టీ సీనియర్ నేత పప్పల చలపతిరావు స్పష్టం చేశారు. ప్రగడ నాగేశ్వరరావు, అతని వర్గీయులు సమావేశ ప్రాంగణం నుంచి వెళ్లిపోయిన అనంతరం అక్కడున్న పార్టీ కార్యకర్తలతో యథావిధిగా సమావేశం నిర్వహించారు. పొత్తులో భాగంగా యలమంచిలి టిక్కెట్ జనసేనకు కేటాయించారని, దీనికి అందరూ కట్టుబడాల్సిందేనని, కలిసికట్టుగా ప్రచారం చేయాలని ఆయన చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

అనకాపల్లి: గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారని తెలిపారు. వివరాలు.. అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు 2015 ఏప్రిల్ 29న అప్పటి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు పూడిమడక జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రాజమహేంద్రవరానికి చెందిన బూడిద మహాలక్ష్మీ ప్రసాద్, కుందాం హేమశంకర్ రెండు బ్యాగుల్లో 30 కేజీల గంజాయితో పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఇరు పక్షాల వాదోపవాదాలు ముగిసిన అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా ఏపీపీ వడ్డాది వెంకటరావు వాదనలను వినిపించినట్లు ఎస్పీ చెప్పారు.

ఎప్పటికప్పుడు ఎన్నికల ఖర్చు వివరాలివ్వాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి


రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొంటున్న పార్టీలు, అభ్యర్థులు తమ ఖర్చును ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 77 ప్రకారం పార్లమెంటు స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఫలితాలు వెల్లడించే రోజు వరకు ఖర్చు మొత్తాన్ని ప్రత్యేక అకౌంట్ నిర్వహించి రిటర్నింగ్ అధికారి, వ్యయపరిశీలకులకు రోజువారీ నివేదిక అందించాలన్నారు. లేనట్లయితే సెక్షన్ 10 (ఎ) ప్రకారం వారి అభ్యర్థిత్వం కోల్పోవలసి వస్తుందన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలు, స్టార్ క్యాంపెయినర్ ఖర్చు వివరాలు తెలపాలన్నారు. సెక్షన్ 78 ప్రకారం ఫలితాలు వచ్చిన 30 రోజులలోగా ఖర్చు జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. ఖర్చును వాటికి సంబంధించిన రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ధన రూపంలో రూ.పది వేల కన్నా ఎక్కువ చేయరాదని, అంతకు మించితే చెక్కు ద్వారా చెల్లించాలన్నారు. వాహనాలు, సమావేశాలు, సభల నిర్వహణ, అన్ని విధాల ప్రకటనలు, కమిషన్ నిర్ణయించిన రేట్లను అనుసరించే లెక్కించబడతాయన్నారు. అభ్యర్థిపై పత్రికలలో వచ్చిన ప్రకటనలతోపాటు, వివిధ కమిటీ గుర్తించిన పెయిడ్ న్యూస్ వార్తలను వ్యయంగానే పరిగణిస్తామన్నారు. అనంతరం వ్యయ పరిశీలన అధికారి సహకార శాఖ అకౌంట్స్ అధికారి గోవిందరాజులు ఎన్నికల ఖర్చు, రిజిస్టర్ల నిర్వహణ విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.ఎస్.కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల పోస్టల్, హోమ్ ఓటింగ్‌ల గురించి వివరించారు. 85 ఏళ్ల వయసు పైబడి అనారోగ్యంతో ఉన్నవారికి, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం కలిగిన వారికి పోలింగ్ అధికారి వారి ఇంటికి వెళ్లి ఓటు వేయించుకుంటారని చెప్పారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రసాదరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు డి.రామ్మూర్తి, వివిధ పార్టీల ప్రతినిధులు డి.సంతోష్, అల్లు రాజు, బొలిశెట్టి శ్రీనివాసరావు, జి.చిన్నారావు, పి.నాగేశ్వరరావు, కె.హరనాథబాబు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద ఓటింగ్‌పై చర్యలు

తుమ్మపాల : పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్దే ఓటింగ్‌కు సంబంధించి పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఈసీ సూచించిన ప్రకారం స్వీప్ కార్యక్రమాలు, పీవో, ఏపీవోల శిక్షణ తరగతులు, పత్రికలు, టీవీల్లో వచ్చే వార్తలు, పోలింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు, సిబ్బంది, అధికారుల నియామకాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ తదితర కార్యకలాపాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

అంతకుముందు ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ బి.దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, డీఎస్‌వో కె.వి.ఎల్.ఎన్ మూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, సీపీవో జి.రామారావు, మత్స్యశాఖ ఏడీ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి పాల్గొన్నారు.

పార్టీ విజయానికి పాటుపడే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిత

- డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు
- జనసేన, టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక


జనసేన, టీడీపీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తదితరులు

మాడుగుల : మండలంలోని పోతనపూడి పంచాయతీ నుంచి వీరవల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోరుకొండ సత్తిబాబు ఆధ్వర్యంలో జనసేన నుంచి ఆరుగురు, టీడీపీ నుంచి ఇద్దరు వైఎస్సార్‌సీపీలో చేరారు. డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాడుగులలో వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సియాద్రి కామరాజు, చిక్కాల బాబూరావు, చిక్కాల రాజారావు, చిక్కాల అరుణకుమార్, మట్టా శ్రీను, మెలిపాక పాపారావు, ఇలగుంతల మహలక్ష్మి, శివకుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పార్టీ విజయానికి పాటుపడే ప్రతి కార్యకర్తకు రానున్న కాలంలో ఉజ్వల భవిత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాడుగుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మండల పార్టీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శేనాపతి కొండలరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శిశెట్టి మహేష్, ముచ్చకర్ల రాము, బంటు సత్తిబాబు, మహలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు

గొలుగొండ : కొంకసింగిలో టీడీపీతో పాటు పలు కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీకి చేరారు. వారికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన కొలగాన దేవత, సకిరెడ్డి సత్తిబాబు, కసవరాజు దనాజీ, ఆనంద్, మజ్జి లోవమ్మ, శ్రీనుతో పాటు పలువురు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీకి చేరడం జరిగింది. కొంకసింగి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మంచి మెజార్టీ ఇస్తామని వచ్చిన వారంతా తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చాలా మేలు చేసారని ఇటువంటి పార్టీ గెలుపు కోసం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో స్వచ్ఛందంగా చేరిన వారికి కండువాలు కప్పిన నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

తాండవలో అర్ధరాత్రి బోటు ప్రమాదం


- ఒకరు గల్లంతు


గల్లంతైన అప్పారావు కోసం గాలిస్తున్న దృశ్యం

గొలుగొండ : తాండవ జలాశయంలో ఆదివారం అర్ధరాత్రి రొయ్యల వేటకు వెళ్లిన గరగల అప్పారావు అనే బోటు ప్రమాదంలో గల్లంతయ్యాడు. ప్రస్తుతం రొయ్యల వేట ముమ్మరంగా సాగడంతో గరగల అప్పారావు గ్రామస్తులతో కలసి వేటకు వెళ్లాడు. రొయ్యల వేట సాగిస్తున్న సమయంలో బోటు లోపలకు నీరు రావడంతో బోటు ప్రమాదానికి గురైంది. పక్కనే వేట సాగిస్తున్న జాలర్లు వచ్చి అప్పారావును రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బోటు పూర్తిగా నీటిలో మునిగిపోగా అప్పారావు కనిపించలేదు. స్థానిక జాలర్లు ఎంత వెతికినా ప్రయోజనం కనిపించలేదు. సోమవారం ఎస్ఐ కృష్ణారావు, జాలర్లు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా అప్పారావు జాడ కనిపించలేదని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

పాన్‌షాపుల్లో అక్రమ మద్యం

- ఇద్దరు అరెస్టు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చోడవరం రూరల్ : పట్టణంలోని పూర్ణా థియేటర్, చీడికాడ జంక్షన్‌లలో సోమవారం జరిపిన విస్తృత దాడుల్లో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. చోడవరం ఎస్ఐ డి.శేఖరం తమ సిబ్బందితో పూర్ణా థియేటర్ ఎదుట ఉన్న దూడి సన్యాసిరావు అలియాస్ నానాజీ (40) పాన్‌షాపులో తనిఖీ చేపట్టగా 15 సీసాలతో అక్రమంగా మద్యం కలిగి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని నానాజీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. చీడికాడ జంక్షన్‌లో సిరసపల్లి సురేష్ (35) పాన్‌షాపులో జరిపిన తనిఖీలో నాలుగు మద్యం సీసాలు పట్టుబడడంతో వాటిని స్వాధీనం చేసుకుని సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మాడుగులను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దా

- కూటమి అభ్యర్థులను రిటర్న్ పార్శిల్ చేద్దాం
- మాడుగులలో అనురాధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం బూడి దిశా నిర్దేశం


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు. వేదికపై మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

మాడుగుల : రెండుసార్లు మాడుగుల కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి సీఎం జగన్ ఆశీస్సులతో అభివృద్ధి అంటే ఇలా ఉంటుందని నిరూపించడం జరిగిందని డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక బసవా రామపరమేష్, గొడౌన్ వద్ద మండలంలో గల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గంలో 111 పంచాయతీలు అభివృద్ధి చేయడంతో పాటు 100 పక్కా తారు రోడ్లతో పాటు నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు సీసీ రోడ్లు డ్రేనేజీలు, దాదాపు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. రూ.178 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాన్యుడైనా మంచి గుణవంతుడని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అనకాపల్లి ఎంపీ టికెట్ ప్రకటించారన్నారు. కానీ ప్రతిపక్షాలు ఉమ్మడి బీజేపీ అభ్యర్థిగా రూ.వేల కోట్లు ఉన్న సీఎం రమేష్‌ను కడప నుంచి ఎంపీ అభ్యర్థిగా అనకాపల్లికి దిగుమతి చేశారన్నారు. అయినా సరే ధనబలాన్ని జన, గుణ బలాలతో అడ్డుకోవడానికి తనతో పాటు అనకాపల్లి పార్లమెంటు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాద్‌ను కూడా అమెరికా నుంచి మాడుగులకు దిగుమతి చేశారని, ఆయన మాడుగులకు ఏమి చేశారని ప్రజలను ఓట్లు అడుగుతారని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే కాక ముందు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, మంత్రి అయినా, డిప్యూటీ సీఎం హోదా వచ్చినా సరే స్వగ్రామం తారువాలో వేప చెట్టు కిందే ప్రజలకు అందుబాటులో ఉండి నమ్మిన సిద్ధాంతం ప్రకారం పదేళ్లుగా సేవలందించడం తెలిసిందేనన్నారు. తాజాగా పార్లమెంటు అభ్యర్థిగా విజయం సాధించి అదే చిత్తశుద్ధితో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. మాడుగులలో మరలా బొడ్డు కళావతి తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు మహిళా అభ్యర్థికి మాడుగుల టికెట్ సీఎం జగన్ ప్రకటించారంటే ఇక్కడి ప్రజలపై ఆయనకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. నా బిడ్డ అనురాధమ్మను, మీ బిడ్డగా చూసుకుని భారీ మెజారిటీతో గెలిపించేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. మాడుగుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈర్లె అనురాధ మాట్లాడుతూ కరోనా సైతం లెక్క చేయకుండా మంచం మీద నుండి దిగలేని అవ్వా తాతలకు ఒకటో తేదీన తలుపు తట్టి పింఛను అందజేసిన వలంటీర్ల సేవలను చంద్రబాబు అండ్‌కో అడ్డుకోవడం దారుణమన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలను రంగంలోకి దింపి ప్రజలను దోచుకోవడానికి చూస్తున్నారని, మరలా సీఎంగా జగన్ రాకపోతే ప్రజలు ఏం కోల్పోతారో ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తన తండ్రి సహకారంతో మాడుగుల ప్రజలకు సేవలందించే భాగ్యం కల్పించాలని కోరారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శేనాపతి కొండలరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు, దేవరాపల్లి శ్రీనివాసరావు, గొల్లవిల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నా చేతకాని కబుర్లేల..

- కొడుకు విజయ్‌కు ఎంపీ టికెట్ తెచ్చుకోలేకపోయావు
- 40 ఏళ్ల రాజకీయం ప్యాకేజీతో సరి
- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ ఎద్దేవా


విలేకర్లతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

గొలుగొండ : నలభై ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న అయ్యన్న తన కుమారుడు విజయ్‌కు ఎంపీ టికెట్ తెచ్చుకోలేకపోయాడని, అయ్యన్న ఆయన కుమారుడు విజయ్ అనకాపల్లి ఎంపీ టికెట్‌ను ప్యాకేజీకి అమ్ముకున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. తాను చంద్రబాబు కంటే సీనియర్‌నని సభల్లో చెప్పుకున్న అయ్యన్న తన కొడుకు విజయ్‌కు టికెట్ సంపాదించలేదేమని ప్రశ్నించారు. కడప నుండి వచ్చిన సీఎం రమేష్ వద్ద ముడుపులు తీసుకొని టికెట్ ఊసెత్తలేదన్నారు. అయ్యన్న కుమారుడు విజయ్ నోటి దురుసు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఇటువంటి పిట్టలదొరకు చంద్రబాబు ఎందుకు టికెట్లు ఇస్తాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీసీ కాలనీ నుండి బొడ్డుపల్లి వరకు ప్రజలకు రోడ్డు సౌకర్యం వచ్చిందని తెలిపారు. 2014 నుండి 19 వరకు నర్సీపట్నం రోడ్డు విస్తరణ చేస్తామని ప్రకటనలు చేసారే తప్ప ఏనాడు పనులు చేయలేదని, రోడ్డు పక్కనే ఉన్న షాపు యజమానుల వద్ద ముడుపులు తీసుకొని ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 90 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లను బెదిరించి అయ్యన్న, అతని కుమారుడు విజయ్ ప్రజాధనం లూటీ చేసారని ఆరోపించారు. గొలుగొండ మండలం పరిధిలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి ఎంతో కృషి చేసి రోడ్డుకు అవసరం అయిన అటవీ అనుమతులు తీసుకురాగా ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తి చేసామన్నారు. పలుసార్లు మంత్రిగా పనిచేసిన అయ్యన్న కనీసం అటవీ అనుమతులు తీసుకురావడంలో విఫలం చెందాడని ఆరోపించారు. పాత కృష్ణదేవిపేట, కొంకసింగి గ్రామాల్లో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు.

కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, పాత కృష్ణదేవిపేట సర్పంచ్ పందిర సత్యంనాయుడుతో పాటు పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

50 ద్విచక్ర వాహనాల సీజ్


వాహనాలతో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో సరైన రికార్డులు లేని 50 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు తమ సిబ్బందితో సోమవారం ఇంటింటికీ తిరిగి రికార్డుల్లేని పలు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

శారదానదిలో గుర్తుతెలియని మృతదేహం

మునగపాక : ఉమ్మలాడ వద్ద శారదానది పరివాహక ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు యలమంచిలి సీఐ గఫూర్, మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహం ఉమ్మలాడ శారదానదిలో ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుడి చేతికి కడియం అలాగే తెల్ల షర్టు, పంచె కలిగిన వ్యక్తి ఆచూకీ కోసం వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9440796087 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

విద్యార్థుల పట్ల అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- విద్యా సంస్థల యాజమాన్యాలతో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి: జిల్లా పరిధిలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్, వివిధ రూపాల్లో జరిగే వేధింపులు, ఇతర సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా సంస్థల యాజమాన్యాన్ని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. తన కార్యాలయంలో సోమవారం విద్యాసంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల వ్యవహార శైలి, మానసిక పరిస్థితిని అధ్యాపకులు ఎప్పటికప్పుడు తెలుసుకుని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేసి, వారి ఆత్మ స్థైర్యాన్ని పెంచాలన్నారు. విద్యార్థులు యాజమాన్యాలు తరచూ సమావేశాలు నిర్వహించి ర్యాగింగ్, ఇతర వేధింపులపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల పర్యవేక్షణ చూడాలన్నారు. విద్యార్థులతో మాదకద్రవ్య నిరోధక కమిటీలు ఏర్పాటుచేసి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, జీఆర్ఆర్ మోహన్, బి.అప్పారావు, సీఐలు చంద్రశేఖర్, అప్పలనాయుడు, వివిధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక కలశ ప్రతిష్ట

కశింకోట: మండలంలోని సుందరయ్యపేటలో నూకాంబిక అమ్మవారి కలశ ప్రతిష్ట ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు. ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగాయి. టమాటా ధర మాత్రం కిలోకు రూ.5 పెరిగింది. గత వారం కిలో రూ.20కి విక్రయించగా, ఈ వారం రూ.25కు అమ్మకాలు సాగాయి. ఉల్లిపాయలు కూడా ఇదే ధరకు విక్రయించారు. అయితే రెండు కిలోలు కొనుగోలు చేస్తే రూ.25, కిలో అయితే రూ.30కి విక్రయించారు. ఇక బంగాళాదుంప రూ.30, వంకాయ, బెండకాయ, దొండకాయ, బరబాటి రూ.40, బీరకాయ, పచ్చిమిరప రూ.50, క్యారెట్, బీట్రూట్ రూ.60, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

రిక్షా కార్మిక సంఘ మాజీ అధ్యక్షుడు కోన మృతి


కోన సత్య నారాయణ(ఫైల్)

అనకాపల్లి: అనకాపల్లి రిక్షా కార్మికుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ(75) గొంతు క్యాన్సర్‌కు ఏడాదిగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మండలంలోని తన స్వగ్రామం మూలపేటలో మరణించారు. ఈయనకు భార్య నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రిక్షా కార్మికులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా లోన్‌లు ఇప్పించి ఆదుకున్నారు. కోన మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

మాకవరపాలెం: దివ్యాంగులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తామని మ్యూచువల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సతీష్ సోమవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి మే 15వ తేదీ వరకు దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్, ఎంఎస్ ఆఫీస్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను ఆధార్, సదరం ధ్రువీకరణ పత్రంతోపాటు నాలుగు ఫొటోలతో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9951938520 సంప్రదించాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	:	సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్	:	షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	పర్తిసాయి
ది గోట్ లైఫ్	:	వెంకటేశ్వర
హనుమాన్	:	శ్రీసత్య
టిల్లు స్క్వేర్	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 9,888 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,590	4,240
మొదటి రకం	3,500	4,090
రెండో రకం	3,420	3,800
మూడోరకం	3,280	3,500

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఈ రెండు మాసాలు ఎలాగోలా గడిపేస్తాం


వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

- 'కూటమి' నేతల కుయుక్తులపై లబ్ధిదారుల కన్నెర్ర
- పింఛన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను ఆపేయడంపై ఆగ్రహం
- రెండు నెలల తర్వాత వచ్చేది మా జగనన్న ప్రభుత్వమేనంటూ స్పష్టం

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట: వలంటీర్.. బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో తానూ ఒకరు. తన పరిధిలోని దాదాపు 50 కుటుంబాల సుఖసంతోషాల్లో కీలక పాత్ర వలంటీర్‌దేనంటే అతిశయోక్తి కాదు. జవసత్వాలుడిగిన పండుటాకులు, ఇంటి పెద్ద దిక్కు దూరమైన ఇల్లాళ్లు, ఇల్లు దాటి వెళ్లాలంటే వేరొకరి సాయం కోరే దివ్యాంగులు.. ఇలాంటి వారికి ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రత్యక్షమయ్యే ఆపద్బాంధవులు వలంటీర్లు. రేషన్ సరుకులు ఇంటి ముంగిటకు వచ్చినా, అవసరమైన పత్రాలు సచివాలయం నుంచి పొందాలన్నా, తమకు అర్హతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవాలన్నా.. బాసటగా నిలిచే పెద్ద దిక్కు వలంటీరే. అలాంటి సేవకులపై ×కూటమి×కక్ష గట్టింది. తప్పుడు ఫిర్యాదులతో ఎన్నికల సంఘాన్ని మభ్య పెట్టింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుంది. దీంతో పండుటాకులు విలవిల్లాడుతున్నాయి. ఎప్పుడూ ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి ముంగిట నిలిచి, అవ్వా.. తాతా.. అత్తా.. పిన్నీ.. మామా.. అన్నా అంటూ బంధుత్వాలు కలిపి మరీ పింఛన్ అందించే వలంటీర్ రాకపోయేసరికి ఆందోళన పడ్డారు. కొందరైతే తమ వలంటీర్‌కు ఏదైనా కష్టం వచ్చిందేమోనని కంగారుతో వారింటికి పయనమయ్యారు. తీరా చంద్రబాబునాయుడి కుట్ర కారణంగా వలంటీర్లు తమ గుమ్మానికి రాలేకపోతున్నారని తెలిసి బాధపడ్డారు. వారికి లబ్ధిదారులే కాస్త బాసటగా నిలిచారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటేనే ఇలా ఉంటే.. రేపు పొరపాటున అధికారంలోకి వస్తే తమ బతుకులెలా ఉంటాయో తెలుసుకున్నారు. తమ బతుకులు బాగుండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలంటూ నిర్ణయించుకున్నారు. తమ కష్టాలు ఈ రెండు నెలలో కదా.. తర్వాత మళ్లీ మా జగన్‌బాబే సీఎంగా వచ్చి, మా కష్టాలు తీరుస్తారనుకుంటూ ఇంటి బాట పట్టారు.

పింఛన్‌తోనే నెల గడిచేది



ఈ రోజు వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తారని ఎంతగానో ఎదురు చూశాను. పింఛన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను ఆపేశారని మధ్యాహ్నానికి తెలిసింది. వలంటీర్లను రకరకాలుగా ఇబ్బందులు పెట్టిన విపక్షాలు ఇపుడు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయి. వృద్ధులను బాధపెట్టిన ప్రభుత్వాలు దేశ చరిత్రలో మనుగడ సాగించిన పరిస్థితి లేదు. ప్రభుత్వం అందించే పింఛన్‌పైనే బతుకుతున్న మాలాంటి వారిని ఇబ్బంది పెట్టడం సరి కాదు. ప్రతీ నెల ఒకటో తేదీ తెల్లవారేసరికి ఇంటికి వచ్చి పింఛన్ అందించే వలంటీర్లను అడిగితే తమను విధుల్లో లేమని చెప్పడం బాధనిపించింది. పింఛన్ అందితేనే నెలవారీ సరకులు కొనుక్కునేది.

– యర్రంశెట్టి దేముళ్లు, శారదాకాలనీ, అనకాపల్లి

ఇలాకూడా బతకనీయరా?



గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డారో జనాలు మర్చిపోలేదు. రోజులు, నెలల తరబడి కూడా వారిచ్చే అరకొర పింఛన్‌కు ఎదురు చూసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాకే పింఛన్లు ఠంచనుగా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే అందుతున్నాయి. నేను దివ్యాంగుడిని. ఇంటి నుంచి కదలాల్సిన పనిలేకుండా వలంటీరే వచ్చి నాకు పింఛన్ డబ్బులు అందించేవారు. ఈ నెల ఒకటో తేదీ వచ్చినా ఇంకా వలంటీర్ రాకపోవడంతో వెతుక్కుంటూ ఇలా బయటికొచ్చాను. తీరా బయటికి వచ్చాక తెలిసింది.. దీనికంతా కారణం చంద్రబాబే నని. ఇలా కూడా మమ్మల్ని ప్రశాంతంగా బతకనీయరేమో?

– మండా సత్తిబాబు, గవరపేట, కశింకోట

ఆ బాధలు మాకొద్దు



నా భర్త పదేళ్ల క్రితం మరణించారు. నా కుమారుడి వద్ద జీవిస్తున్నాను. రూ.2 వేల నుంచి ఇపుడు రూ.3 వేలు పింఛన్ అందుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ మా ఇంటికే వచ్చి నేరుగా పింఛన్ డబ్బులు నా చేతికిచ్చేవారు. ఈ నెల కూడా వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తారని ఎదురుచూశాను. కానీ ఎలక్షన్లు ఉన్నాయని, వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా ఆపేశారట. ఇది సబబు కాదు. ఐదేళ్లుగా వలంటీరే మాకు అన్ని పథకాలూ అందిస్తున్నారు. ఈ నెల, వచ్చే నెల కూడా వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వరంటున్నారు. వలంటీర్లను కాదని సచివాలయానికి వెళ్లి, పింఛన్ తీసుకోవాలన్నారు. మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేసుకుంటేనే భయమేస్తోంది. ఆ బాధలు మాకొద్దు.

– మంత్రి సీతమ్మ, రేబాక, అనకాపల్లి

కరోనాలో కూడా ఇంటికే వచ్చారు



పండ్ల చెట్లను లీజుకు తీసుకుని సీజన్‌లో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగిస్తుంటారు. గత ప్రభుత్వం హయాం నుంచి వితంతు పింఛన్ వస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా ఆరంభంలోనే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారు. ఈ మొత్తం నా కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. కరోనా సమయంలో కూడా వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. అలాంటి కష్ట సమయంలో కూడా ఆగని పింఛన్ పంపిణీ ఇపుడు ఆలస్యం అవడం ఆందోళన కలిగించింది. పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లపై ఇలాంటి కుట్రలు పన్నడం సరికాదు. ఎప్పటిలాగే సకాలంలో ఇంటికే వచ్చి మాకు పింఛన్లు అందించాలి.

– పల్లం పార్వతి, మేదరవీధి, కశింకోట

పేదల కష్టం.. చంద్రబాబుకు ఆనందం



నాకు వయసు పైబడింది. దీనికి తోడు దీర్ఘకాలిక అనారోగ్యం. ప్రభుత్వ ఇచ్చే వృద్ధాప్య పింఛనే నాకు ప్రధాన ఆధారం. కొన్ని అత్యవసర మందులు, చిన్ని చిన్న అవసరాలు ఈ సొమ్ముతోనే తీరుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో పింఛన్ సొమ్ము ఆలస్యమైన దాఖలాల్లేవు. ఈ రోజు ఉదయం నుంచి వలంటీర్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. ఎంతకీ రాకపోవడంతో పొరుగింటి వారి ద్వారా అసలు విషయం తెలిసింది. పేదల పొట్ట కొట్టడంలో చంద్రబాబుకు ఉన్నంత ఆనందం మరెవ్వరికీ ఉండదు. జగన్ పాలనలోనే మా బతుకులకు భరోసా దక్కింది. వలంటీర్లపై కుట్రలు పన్నుతున్న చంద్రబాబుకు ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారు.

– పెంటకోట జగ్గారావు, వెలంపేట, కశింకోట

పింఛన్ల కోసం మళ్లీ నిరీక్షణ



ప్రతి నెలా తెల్లవారక ముందే పింఛన్ డబ్బులు చేతికి అందుకోవడం అలవాటు అయింది. ఐదేళ్లుగా ఈ ప్రభుత్వం చేసిన ఏర్పాటు మాకెంతో సౌకర్యంగా ఉండేది. వలంటీర్ ఒకటో తేదీనే తలుపు తట్టి, నిద్రలేపి మరీ పింఛన్ అందించిన రోజులున్నాయి. పింఛన్ల కోసం ఈ ప్రభుత్వంలో ఏనాడూ పడిగాపులు కాయలేదు. ఇపుడు మళ్లీ రోడ్ల మీద, చెట్ల కింద, దేవాలయాల వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాయలంటే ఇబ్బందిగా ఉంటుంది. గత ప్రభుత్వంలో పింఛన్ లబ్ధిదారుల కష్టాలు అందరూ చూశారు. చంద్రబాబునాయుడి బుద్ధి ఎప్పటికీ మారదు. తాను చేయడు.. ఎవరైనా చేస్తే సహించలేడు. మాలాంటి బతుకుల్ని ఇబ్బంది పెట్టి ఆయనేం బావుకుంటాడో..?

– నరవ పార్వతి, శారదాకాలనీ

కూటమి బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దు

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


మారేడిపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు


81వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు బూటకపు హామీలతో ఇంటింటికీ వచ్చి ప్రచారాలు చేస్తారని, సీఎం జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వెయ్యాల్సిందిగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. గవరపాలెం 81వ వార్డులో కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో పీలా సోమేష్‌నాయుడు వీధి, దాసరిగెడ్డ రోడ్డు, సత్తెమ్మతల్లి ఆలయరహదారి, గౌరీసంఘం రహదారిలో గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుని, మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని అందుకోవాలని అభ్యర్థించారు. పేద ప్రజల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే మన రాష్ట్రం శ్రీలంకగా మారిపోతుందని ఆరోపించిన చంద్రబాబు అంతకు మించిన హామీలతో ప్రజల్ని ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక కూటమి కట్టి పోటీ చేస్తున్నారని ఆక్షేపించారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఈ పోటీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, విల్లూరి శివసూరి, దాడి నారాయణరావు, మురళీకృష్ణ, కాండ్రేగుల రాము, వేగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

- మండలంలో మారేడుపూడి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఎంపీపీ గొర్లి సూరిబాబు గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బంది పడరాదని సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం జగన్‌ను గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్థానిక నేతలు గంగుపాం నాగేశ్వరరావు, ఈగల కృష్ణమూర్తి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో దిలీప్ ప్రతిభ


కాంస్య పతకం పొందిన దిలీప్

కశింకోట: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కె.దిలీప్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 17 ఏళ్లలోపు బాలుర విభాగంలో 72 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకాన్ని సాధించినట్లు హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం దిలీప్‌ను ఆయనతో పాటు పీడీ వి.ప్రభాకరరావు, విద్యా కమిటీ చైర్మన్ మేరీ సుజాత, ఉపాధ్యాయులు ఆచంట నాగేశ్వరరావు, రవి, రామారావు, కె.అప్పారావు, బి.అప్పారావు, సూర్యారావు, సునీత తదితరులు అభినందించారు.

టెన్త్ విద్యార్థిని అదృశ్యం

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం హైస్కూల్లో 10వ తరగతి పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యం అయినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్‌ఐ పీవీ రమణ తెలిపిన వివరాలు. మండలంలో కృష్ణాపురం గ్రామానికి చెందిన టెన్త్ విద్యార్థిని ఈ నెల 30న ఒకేషనల్ పరీక్ష రాసేందుకు గాంధీనగం హైస్కూల్ పరీక్ష కేంద్రానికి వెళ్లింది. ఇంటి నుంచి పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థిని తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి చూశారు. అయినా జాడ తెలియకపోవడంతో సోమవారం విద్యార్థిని తల్లి అమ్మాజీ పోలీసులనాశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

22 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: పట్టణంలోని రింగురోడ్డు జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి 22 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శంకర్‌రావు సోమవారం తెలిపారు. ఈ మేరకు వాహనదారులు కె.రమేష్, శ్రీధర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

భారత స్వాభిమాన్ ట్రస్టు అధ్యక్షుడిగా భీశెట్టి

అనకాపల్లి: భారత స్వాభిమాన్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడిగా భీశెట్టి దొరమ్మనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో సోమవారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా విల్లూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జి.మంగయ్య, కోశాధికారిగా కొణతాల శివాజీ, గౌరవాధ్యక్షుడిగా బీఎస్ఎంకే జోగినాయుడు, సలహాదారులుగా పెంటకోట సుబ్రహ్మణ్యం, సభ్యులుగా కేవీవీ సత్యనారాయణ, బి.శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దొరమ్మనాయుడు మాట్లాడుతూ కమిటీ రెండేళ్లపాటు మనుగడలో ఉంటుందన్నారు. ఈ నెల 7 నుంచి నెల రోజులు పాటు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నటుల వెల్లడించారు,

క్రమశిక్షణతోనే ఉన్నత భవిత


వ్యాస రచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న రాములమ్మ

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరచుకుని, ప్రణాళికాయుతంగా చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎస్.రాములమ్మ అన్నారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశంపై సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక వికాసాన్ని పెంపొందించుకుని, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఎదగాలని కోరారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం, హెచ్‌ఎం జి..బ్రహ్మాజీ, అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, బొడ్డు సోమరాజు, పెదిరెడ్ల సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్‌గా రాజీనామా చేసి ఎన్నికల ప్రచారానికి..


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న వలంటీర్ వెంకట విజయతో వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని 84వ వార్డు తాకాశివీధి సచివాలయం వలంటీర్ శఠగోపం వెంకట విజయ అన్నారు. సోమవారం ఆమె తన వలంటీర్ విధులకు రాజీనామా చేస్తూ, ఆ పత్రాన్ని జోనల్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు నాలుగేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి, అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో ఎంతో ఆనందాన్ని పొందానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించుకునేలా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తానన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి స్వయంగా తెలుసు కాబట్టే, వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేయాలన్న వెంకట విజయ నిర్ణయం సంతోషకరమన్నారు. వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు పన్నుతున్నాయని, రానున్న ఎన్నికల్లో కూటమికి తప్పకుండా ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. వీరి వెంట భోగలింగేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ వాసుపల్లి తాతయ్యలు, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు శ్రీధరాల మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతకు కొత్త అమావాస్య కళ


తాళ్లపాలెం సంతలో గొర్రెలు, మేకల విక్రయాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతకు సోమవారం కొత్త అమావాస్య కళ వచ్చింది. ఎక్కువ సంఖ్యలో గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చాయి. దీంతో సంత కళకళలాడింది. రానున్న కొత్త అమావాస్య జాతరలో ఎక్కువగా గొర్రెలు, మేకలు వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి పెంపకందారులు, వ్యాపారులు ఎక్కువగా గొర్రెలు, మేకలను అమ్మకానికి తీసుకు వచ్చారు. ఒక్కొక్క గొర్రె, మేక పరిమాణం అనుసరించి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు సాగాయి. జిల్లాలోని వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు, ఉత్సవ నిర్వాహకులు వీటిని ఎక్కువగా కొనుగోలు చేశారు. ఆశించిన ధర రాలేదని కొందరు పెంపకందారులు, వ్యాపారులు గొర్రెలు, మేకలను వ్యాన్లు, ఆటోల్లో వెనక్కి తీసుకుపోయారు.

రేపటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ


ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: సచివాలయం కేంద్రంగా ఈ నెల 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను దూరం పెట్టినట్లు తెలిపారు. గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు మిగిలిన సచివాలయ సిబ్బంది పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని 8,364 మంది పింఛన్ దారులకు రూ.2.44 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఏవోఎస్. బాబూరావు, హౌసింగ్ ఏఈ శేఖర్ ఉన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ పిన్నింటి రమణ


దొంగతనాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న సీఐ రమణ

సబ్బవరం: ప్రజలంతా దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. చెడ్డీ గ్యాంగ్ పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేయిస్తూ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా వేసవికాలం కావడంతో ఉక్కబోతకు ఆరుబయట నిద్రించే అవకాశం ఉంటుందన్నారు. ఇదే అనువుగా దొంగలు చెలరేగే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇళ్లల్లో తక్కువ డబ్బులు ఉండే విధంగా చూసుకోవడంతో పాటు విలువైన బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచుకోకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలు అధికంగా జరగుతుండడంతో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలు, మెబైల్‌లో వచ్చే పలు రకాల లింక్‌లపై క్లిక్ చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

రోడ్డు ప్రమాదాల కట్టడికి ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపినా, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించినా చర్యలు తప్పవన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో నూతంగా నిర్మించిన అభయ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, కె.వినోద్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, డి.వి.రమణ, నాయకులు పైల అప్పలనాయుడు, మేడిశెట్టి ఈశ్వరరావు, రేబాక నరేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

90 మద్యం సీసాల స్వాధీనం


కన్నూరు వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పరవాడ: లంకెలపాలెం ప్రాంతంలో ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సబ్బవరం మండలం అమృతపురం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 90 మద్యం సీసాలను సీఐ ఎస్.బాలసూర్యారావు సోమవారం కన్నూరు గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నారు. అమృతపురం గ్రామానికి చెందిన గండి సత్తిబాబుపై కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.